క్లుప్తంగా

ప్రమాద బీమా సద్వినియోగం కావాలి



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

బొండపల్లి: ఉపాధి వేతనదారుల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనకు దరఖాస్తులు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.తులసీనాథ్ సూచించారు. మండల కేంద్రంలోని జగ్గన్న బందలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులకు ఈ పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి వేతనదారు ఏడాదికి 20 రుపాయలు చెల్లించి ఈ బీమాలో చేరవచ్చన్నారు. ప్రమాదవశాత్తు వేతనదారు మరణిస్తే కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా అందుతుందన్నారు. ఈ నెలాఖరులోగా తమ దరఖాస్తులను సంబంధిత క్షేత్ర సహాయకులకు అందజేయాలని సూచించారు. ఏపీఓ జి.అరుణ పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి పంచ హారతి బహూకరణ



వెండి పంచ హారతి అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి వెండి పంచ హారతిని బహూకరించారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కుమిలి రమణ, పార్వతి దంపతులు అమ్మవారికి దీన్ని బహూకరించారు. రూ.12 వేలు వెచ్చించి దాదాపు 128 గ్రాముల వెండి పంచ హారతిని అమ్మవారికి దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్, ఆలయ అర్చకులు రవిశర్మలకు అందజేశారు.

జాబ్‌మేళా విజయవంతం



నియామక పత్రాలతో యువత

చీపురుపల్లి: పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమయ్యింది. ఆ కళాశాల కరెస్పాండెంట్ దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు పేటీఎం, అపోలో ఫార్మసీ, శ్రీవేన్ ఫార్మా, ఠాగూర్ ఫార్మా, యకోమా టైర్స్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు 200 మంది వరకు నిరుద్యోగ యువత హాజరయ్యారు. ఇందులో వంద మందికి పైగా యువతను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. అనంతరం వారికి కళాశాల కరస్పాండెంట్, కంపెనీల ప్రతినిధులు సంయుక్తంగా నియామక పత్రాలు అందజేశారు.

గ్రీవెన్స్ ఫిర్యాదుపై జేసీ విచారణ



క్షేత్ర స్థాయిలో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

కొత్తవలస : మండల కేంద్రం కొత్తవలస రెవెన్యూ పరిధి సర్వే నంబరు 142–1లో గెడ్డ వాగు నిర్ధారణపై మండలానికి చెందిన విన్నకోట గౌతం కలెక్టరేట్‌లో ఇటీవల జరిగిన గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ క్షేత్ర స్థాయిలో శుక్రవారం విచారణ జరిపారు. ఫిర్యాదుదారుడిని తహసీల్దార్ సమక్షంలో విచారణ నిర్వహించారు. ఈ సర్వే నంబరులో వాగు ఉందా...లేదా.. అనే అంశంపై పూర్తి స్థాయి రికార్డులతో వచ్చే శుక్రవారం మళ్లీ విచారణ చేస్తామన్నారు. అప్పటికి తహసీల్దార్, ఇరిగేషన్ జేఈ, ఫిర్యాదుదారులు కొత్తవలస తహసీల్దార్ కార్యాలయంలో హాజరు కావాలని జేసీ సూచించారు. తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఆర్ఐ రాజేష్ తదితరులు ఉన్నారు.

మలేరియాపై.. వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు



దత్తిరాజేరు : రామచంద్రపురంలో అవగాహన ర్యాలీ

వేపాడ: మండలంలోని వేపాడ, బొద్దాం పీహెచ్‌సీ పరిధిలో మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు డా.అజయ్‌కుమార్, డా.పి.శివాని నేతృత్వంలో ర్యాలీలు నిర్వహించారు. కొండగంగబూడిలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు మలేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి బి.శ్రీనివాసరావు, హెచ్ఎస్ మూర్తి పాల్గొన్నారు. వేపాడలో డా.అజయ్‌కుమార్, సీహెచ్ఓ ఆంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు: మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎ.కొత్తవలస పీహెచ్‌సీవైద్యాధికారి కె.రఘు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా షికారుగంజి, రామచంద్రపురం గ్రామాల్లో సిబ్బందితో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రఘు, మురళి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడలో..

గంట్యాడ: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని గంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమలత అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస/లక్కవరపుకోట : దోమల నియంత్రణ మనందరి బాధ్యతని, ప్రతీ ఒక్కరు దోమల నిర్మూలనకు కృషి చేయాలని కొత్తవలస మండలం వియ్యంపేట, ఎల్.కోట మండల పీహెచ్‌సీ వైద్యులు ఇ.గోపాలకృష్ణ, అనిల్‌కుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీని శుక్రవారం ఆయా పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల సిబ్బంది జగదాంబ, తిరుపతిరావు, పద్మావతి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే బొత్స పుట్టిన రోజు వేడుకలు

దత్తిరాజేరు : గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పుట్టినరోజు వేడుకలను దత్తిరాజేరు మాజీ సర్పంచ్ మహాదేవ్ ఫణీంద్రుడు ఇంటి వద్ద శనివారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున శుక్రవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసిన అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు

ఎస్ఐగా సుదర్శన్ బాధ్యతల స్వీకరణ



వేపాడ: మండలంలోని వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎస్.సుదర్శన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వల్లంపూడిలో పని చేసిన ఎస్ఐ దేవి విజయనగరం వీఆర్‌లో పెట్టారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సుదర్శన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఏఎస్ఐ నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





రహదారి నాణ్యత పరిశీలించిన అధికారులు



ఆతవ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

వేపాడ:

మండలంలోని వేపాడ – సోంపురం జంక్షన్ నుంచి ఆతవ గ్రామానికి వేసిన సీసీ రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ శాఖాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆతవ జంక్షన్ నుంచి ఆతవ గ్రామానికి సుమారు 2.1 కి.మీ. మేర పీఐయూ నిధులు రూ.1.28 కోట్లతో చేపట్టిన తారురోడ్డు నాణ్యతను పరిశీలించారు. ఈఈ ప్రదీప్‌కుమార్, డీఈ సోములు, సత్యనారాయణ, ఏఈ శ్రీనివాసరావు, జేఈ మానస తదితరులు నాణ్యతను చూశారు. నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ఉగ్ర దాడులపై నిరసన



ఎస్.కోటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

శృంగవరపుకోట: ఉగ్ర దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, జమ్ము కాశ్మీర్‌లో జరిగిన దాడి అమానుషమని నిరసిస్తూ ఎస్.కోటలో సీపీఐ శ్రేణులు శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని నినదించారు. ఈ తరహా దాడులను ప్రజలంతా ముక్త కంఠంతో ఖండించాలని అన్నారు. నిరసనలో ఆ పార్టీ నేతలు ఖండిపల్లి భీములు, రామకృష్ణ, శ్రీను, ఆ పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

శృంగవరపుకోట: బీజేపీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు మరిశ శ్రీను నేతృత్వంలో ఉగ్ర దాడిని నిరసిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, సమరసత సేవా సంఘం, టీడీపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ నేతలు సి.హెచ్.ఆర్.కె.ప్రసాద్, డి.సూర్యారావు, ఎస్.ఆర్.వి.రూపేష్, రామకోటి, చిరంజీవి యాదవ్, మల్లేశ్వరరావు, చెక్కా కిరణ్, సాయిరామ్, సురేష్, రాజు చంటి, చిన్ని, రమణ, తదితరులు డిమాండ్ చేశారు.

కొత్తవలసలో..

కొత్తవలస : స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడులను నిరసిస్తూ శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఉగ్ర దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మంగళపాలెం గ్రామ సమీపంలో గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో మృతులకు నివాళులర్పించారు.





ఎక్కడ చూసినా.. చెత్తే...!



మధుపాడ గ్రామంలోని పెద్ద కాలువల్లో పేరుకు పోయిన వ్యర్థాలు



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన వీధి కాలువలు

గజపతినగరం మండలం మధుపాడ గ్రామంలో ఎక్కడ చూసినా చెత్తే కనిపిస్తోంది. గ్రామంలో కాలువల్లో మురుగు నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ కార్యాలయానికి ప్రజలు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పరిస్థితి లేదు. పారిశుధ్య లోపంతో దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయి. మురుగు నిల్వలతో దుర్గంధం వ్యాపిస్తోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులకు చీమకుట్టినట్టైనా లేదని స్థానికులు దుమ్మెత్తిపోస్తున్నారు. – గజపతినగరం రూరల్

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి వైద్యాధికారికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

వేపాడ: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్ఓ ఎస్.జీవనరాణి శుక్రవారం మధ్యాహ్నం సందర్శించారు. ఆసుపత్రిలో రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. మందుల నిల్వలు, వ్యాధి నిరోధక టీకాలపై వివరాలు సేకరించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు శతశాతం వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మందుల స్టాకు రిజిస్టరు పరిశీలించారు. వైద్యాధికారి అనిల్‌కుమార్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీహెచ్ఓ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం వద్దు..

లక్కవరపుకోట : వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, ప్రతీ ఒక్కరు సమయపాలన పాటించాలని లేదంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారిణి జీవనరాణి హెచ్చరించారు. మండల కేంద్రంలోని లక్కవరపుకోట పీహెచ్‌సీని ఆమె శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఓపీపై ఆరా తీశారు. ప్రస్తుత గదిని పరిశీలించి తగు చూచనలు చేశారు. ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయాలని రిఫర్ చేయవద్దని సూచించారు. అలాగే మందుల నిల్వలను తనిఖీ చేశారు. వైద్యాధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.











